

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు





గ్రామస్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు కమిటీలు

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

చిత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో కోల్పోయిన ధైర్యాన్ని తిరిగి నింపడమే జనసేన లక్ష్యం. ఆ దిశగా పార్టీ అడుగులు వేస్తోంది. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తాం' అని జనసేన అధ్యక్షుడు,డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు.చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలో డీఎంహెచ్‌వో కార్యాలయం వెనుకవైపు ఏర్పాటుచేసిన డీడీవో కార్యాలయాన్ని గురువారం మధ్యాహ్నం ప్రారంభించిన ఆయన అదే ఆవరణలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జనసేన బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ, పార్లమెంటు స్థాయి వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలను నియమిస్తాం. మరో 15 ఏళ్ల పాటే ఇదే స్ఫూర్తితో కొనసాగాలి. అప్పుడే అభివృద్ధి సుస్థిరమవుతుంది. కూటమి నాయకులతో చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుని పరిష్కరించుకోండి. వైసీపీ హయాంలో ఈ జిల్లాకే తలమానికమైన శేషాచలం అడవుల్ని అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటి వరకు దొరికిన సంపద 10 శాతం మాత్రమే. ఇదే వేల కోట్ల రూపాయల్లో ఉంటే దొరకనిది ఎన్ని వేల కోట్ల రూపాయల్లో ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటి వాళ్లను మనం నిలువరించాలి'అన్నారు.గత నెలలో తిరుపతి, పలమనేరు ప్రాంతాల్లో పర్యటించిన పవన్ తమను పట్టించుకోలేదని జనసేన శ్రేణులు అసంతృప్తి చెందినట్లు ప్రచారం జరిగింది.ఈ నేపథ్యంలో ఈసారి ఆయన చిత్తూరు పర్యటనలో జనసేన శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఆకాశానికెత్తేసిన ఎమ్మెల్యేలు



తిరుపతిలో చిన్నారిని పలకరిస్తూ...

ఇదే సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పవన్‌ను ఆకాశానికెత్తేశారు.గ్రామాల్లో కూడా బెంజి కార్లు వెళ్తున్నాయంటే మీరు నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో జరిగిన అభివృద్ధే కారణమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అభినందించారు.వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా జైలులో పెట్టినప్పుడు.. మీరిచ్చిన సపోర్టు మరువలేనిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు.సీఎం అనుభవం, మీ సామర్థ్యంతోనే పీఆర్, ఆర్‌డీ శాఖలు బలోపేతమవుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు.కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ చెప్పారు. హస్తకలల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, జనసేన నాయకుడు హరిప్రసాద్ మాట్లాడుతూ జనసేనకు నియోజకవర్గ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేశామని, భవిష్యత్తులో మరింత బలోపేతం చేసేలా ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పుకొచ్చారు.

స్వచ్ఛరథాన్ని పరిశీలించి...

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని గ్రామ పంచాయతీల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు పంచాయతీరాజ్ శాఖ ఇటీవల ప్రయోగాత్మకంగా స్వచ్ఛరథాలను ఏర్పాటు చేసింది.గురువారం చిత్తూరు డీడీవో కార్యాలయం వద్ద ఉంచిన స్వచ్ఛరథాలను ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పరిశీలించారు. పొడిచెత్త,పనికిరాని వస్తువులు స్వచ్ఛరథ సిబ్బందికి అందిస్తే బదులుగా వారికి నిత్యావసర వస్తువులను అందిస్తారు. తిరుపతి జిల్లా తిరుచానూరు, కరకంబాడి పంచాయతీల్లో తిరుగుతున్న ఈ స్వచ్ఛరథాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి డిప్యూటీ సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులను అభినందించారు.



కలెక్టర్‌కు పవన్ అభినందన

కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు.డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురితో మాట్లాడారు. అల్లూరిసీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ పనిచేసే సమయంలో పాడేరు ప్రాంతంలోని గంజాయి సాగును అరికట్టారు. 2023లో 10 వేల ఎకరాలు, 2024లో 7 వేల ఎకరాల్లో గంజాయి సాగును తొలగించి ఉపాధిహామీ పథకం ద్వారా జీడీపప్పు, బ్లాక్ పెప్పర్, చిలకడదుంప పంటలను సాగు చేయించారు. ఆ సమయంలో ప్రస్తుతం సత్యసాయి జిల్లా ఎస్పీగా ఉన్న సతీష్‌కుమార్ కూడా తీవ్రంగా కృషి చేశారు. ఈ విషయం తెలుసున్న పవన్, పాడేరు డీడీవో వీసీలోకి రాగానే సుమిత్‌కుమార్ చేసిన కృషిని గుర్తుచేశారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడుతూ...

సాఫీగా సాగిన పర్యటన

చిత్తూరు కలెక్టరేట్,డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటన షెడ్యూల్ కంటే గంట అదనంగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరుకు చేరుకున్న ఆయన ఒంటిగంటకు కాకుండా మధ్యాహ్నం 2.10గంటలకు తిరుగుపయనమయ్యారు.డీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్న ఆయనకు కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడే ఏర్పాటు చేసిన చిత్తూరు డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించాక కార్యాలయ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన 77డీడీవో కార్యాలయాల ఫొటో ఎగ్జిబిషన్‌ను పవన్ పరిశీలించారు.కొన్ని వివరాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వి.ఆర్. కృష్ణతేజను అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లా డీడీవో కార్యాలయ వివరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. అనంతరం డీడీవో కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో 77 డీడీవోల కార్యాలయాలను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.అనంతరం మంత్రులు, జడ్పీ సీఈవోలు,డీడీవోలతో ఇంటరాక్ట్ అయ్యారు.తరువాత అక్కడే ఏర్పాటు చేసిన గుడారంలో కూటమి పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం 2.10 గంటలకు బయట వేచివున్న ప్రజలకు అభివాదం చేస్తూ బయలుదేరివెళ్ళారు.ఆయన వెంట ప్రత్యేక కార్యదర్శి కృష్ణతేజ,ఎమ్మెల్యేలు జగన్మోహన్ , మురళీమోహన్,శ్రీనివాసులు,శ్రీధర్,మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత,హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పవన్‌ను జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ అధ్యక్షుడు సీఎంటీ త్యాగరాజన్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు పాఠశాలల్లో సందడే సందడి

- 2460 స్కూళ్లలో మెగా పీటీఎం నిర్వహణ
- జిల్లాకు రూ.47.54 లక్షల కేటాయింపు
- ముఖ్య అతిథులుగా ప్రజా ప్రతినిధులు



మెగా పీటీఎంకు కార్వేటినగరం మండలం డీఎం పురం జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థుల ఆహ్వాన ప్రదర్శన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 3.0 నిర్వహించనున్నారు. జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలోని 2460 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. పీటీఎం నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.900 నుంచి రూ.9 వేల చొప్పున రూ.47.54 లక్షల మేర ప్రభుత్వం విడుదల చేసింది. గత ఏడాదిలా ఆటపాటలతో కాకుండా ఈసారి పూర్తిగా విద్యార్థుల అభ్యసనా, అంశాలపైనే తల్లిదండ్రుల సమక్షంలో సమీక్షలు నిర్వహిస్తారు. పాఠశాలల్లో పీటీఎంను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ నేతృత్వంలో ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. పాఠశాలలో పోలీసులతో పాటు వైద్య బృందాలు ఉంటాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించే మెగా పీటీఎం 3.0లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు.

ప్రదర్శనలు

స్వీయ రక్షణలో భాగంగా విద్యార్థినులకు కరాటే విద్యను నేర్పించారు. దీన్ని ప్రతి పాఠశాలలో విద్యార్థులు 15 నిమిషాల పాటు తల్లిదండ్రుల ఎదుట ప్రదర్శించనున్నారు. 54 అంశాలతో కూడిన మాయా పెట్టె ద్వారా ఇంద్రజాల ప్రదర్శన, ఫౌండేషన్ ఆన్ లిటరసీ, న్యూమరికల్ అంశాలను వివరించనున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి బడి భోజనం చేయడం ద్వారా కార్యక్రమం ముగియనుంది.

విద్యాప్రగతిపై దృష్టి

విద్యార్థుల పురోగతిపై దృష్టి సారించనున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలు చదువు తీరును టీచర్లు వివరించనున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన అసెస్మెంట్ పుస్తకాలు, నిర్మాణాత్మక,సంగ్రహణాత్మక పరీక్షలను ఇప్పటికే విద్యార్థులతో రాయించారు. వీటిని పరిశీలిస్తారు. మార్కులు,సబ్జెక్టుల్లో వెనుకబాటు లాంటి అంశాలను లీప్ యాప్ తెలుసుకునే ప్రక్రియను టీచర్లు వివరించనున్నారు.

విద్యార్థుల చదువుపైనే దృష్టి

మెగా పీటీఎం 3.0లో విద్యార్థులకు పాఠ్యాంశాలు, చదువులపై ఉన్న సామర్థ్యాలపైనే ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఆటపాటలపై కాకుండా చదువుల్లో ఎలా రాణిస్తున్నారు, ఎక్కడ లోపాలు ఉన్నాయనే అంశాలపైనే టీచర్లు తల్లిదండ్రులకు వివరించనున్నారు. అదే సమయంలో టెన్త్ విద్యార్థుల వంద రోజుల ప్రణాళిక అమలు, ఇందులో తల్లిదండ్రుల పాత్ర గురించి వివరించనున్నారు.



- వెంకటరమణ, సమగ్రశిక్ష ఏపీసీ

19 మండలాల్లో మోస్తరు వర్షం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అల్పపీడనం ప్రభావం కొనసాగుతోంది. గడచిన 24 గంటల్లో 19 మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసింది. అత్యధికంగా ఎస్.ఆర్.పురంలో 25.4, అత్యల్పంగా సదుం, శాంతిపురం మండలాల్లో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా నింద్రలో 8.2, యాదమరిలో 7.4, పులిచెర్లలో 6.4, పలమనేరులో 6.0, విజయపురంలో 5.2, నగరిలో 4.6, వి.కోటలో 4.2, బంగారుపాళ్యంలో 4.0, చిత్తూరు అర్బన్‌లో 3.2, చిత్తూరు రూరల్, సోమల మండలాల్లో 2.6, గంగవరం, బైరెడ్డిపల్లి మండలాల్లో 2.4, రొంపిచెర్లలో 4.0, గుడిపాల, తవణంపల్లె మండలాల్లో 1.4 మిమీ వర్షం కురిసింది.

నిషేధిత జాబితా నుంచి గుండ్రాజుకుప్పం భూముల తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం గుండ్రాజుకుప్పం భూములను నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం తొలగించింది. ఈ గ్రామంలోలోని సర్వేనెంబరు 55/1లోని మూడెకరాలు, సర్వే నెం. 55/3లో 1.86 ఎకరాలను రిజిస్ట్రేషన్ చట్టం ద్వారా నోటిఫై చేసిన నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

57 పాఠశాలలకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 57 పాఠశాలల్లో రాష్ట్రప్రభుత్వం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (విద్యా వాలంటీర్ల)ను నియమించనుంది. గుర్తించిన సబ్జెక్టుల వారిగా వాలాంటీర్లను నియమించేందుకు అవసరమైన నోటిఫికేషన్ ఇచ్చింది. ం అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. శుక్రవారం సాయంత్రంలోపు అర్హత కలిగిన వారు మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ)లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తుల పరిశీలించి డీఈవో కార్యాలయానికి పంపుతారు. అక్కడ వాటిని పునఃపరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సోమవారం వీరంతా విద్యా వాలంటీర్లుగా కేటాయించిన పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లుగా విధులు చేరాల్సి ఉంది.

రేపటినుంచి అమల్లోకి టెన్త్ వంద రోజుల ప్రణాళిక

- అధికారులకు హైస్కూళ్ల బాధ్యత

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధనకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈక్రమంలో జిల్లా అధికారులకు పదవ తరగతి విద్యార్థులు ఉన్న హైస్కూళ్ల బాధ్యత అప్పగించనుంది. ఈనెల 6 నుంచి వంద రోజుల అకడమిక్ ప్రణాళికను అమలు చేయనున్నారు. విద్యార్థుల ప్రగతిని మానిటరింగ్ చేయనున్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా, అంకితభావంతో పనిచేస్తారనేది ప్రభుత్వ ఉద్దేశం. తద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. పదవ తరగతి సిలబస్ ఈనెల 5 నాటికి పూర్తి చేయాలని ఇప్పటికే పాఠశాల విద్యా కమిషనర్ విజయ రామరాజు ఆదేశించారు. 6వ తేదీ నుంచి వంద రోజుల ప్రణాళిక ప్రారంభం కానుంది. యూడైస్ ఎలో విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లకు బదులుగా ఉపాధ్యాయుల ఫోన్ నంబర్లు ఇస్తే సంబంధిత టీచర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ హెచ్చరించారు.

తిరుపతి జిల్లాను వీడని వాన

- పలు మార్గాల్లో స్తంభించిన రాకపోకలు
- వేలాది ఎకరాల్లో మునిగిన వరిపొలాలు



శ్రీకాళహస్తి- ముసలిపేడు మార్గంలో వర్షపునీటి ఉధ్రుతి


తిరుపతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను బలహీనపడినా..దాని ప్రభావం మాత్రం తిరుపతి జిల్లాను వీడలేదు. వరుసగా ఐదో రోజూ తూర్పు మండలాల్లో భారీ వర్షాలు కురవడంతో నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.దాదాపుగా చెరువులు, కుంటలు నిండాయి. స్వర్ణముఖి బ్యారేజీ సహా కాళంగి, మల్లిమడుగు రిజర్వాయర్ల నుంచీ నీటిని దిగువకు వదులుతున్నారు. గూడూరులో వర్షంతో పంబలేరు వాగు పొంగడంతో కాజ్‌వేపైకి నీరు చేరి వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. వేములపాడు, తిప్పవరప్పాడు వద్ద కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి.చెన్నూరులో చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు చేరడంతో 200 మంది కార్మికులు పనులు నిలిపివేశారు. 1700 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం ఇంకా జలదిగ్బంధనంలోనే వుంది. వరగలి క్రాస్ వద్ద జాతీయ రహదారి పైకి వరద నీరు చేరడంతో కిలోమీటరు వరకూ వాహనాలు నిలిచిపోయాయి.చిట్టమూరు మండలం పుట్టివానిపల్లి జలదిగ్బంధంలో చిక్కుకుంది. కోట మండలంలో స్వర్ణముఖి ఉధ్రుత ప్రవాహంతో దైవాలదిబ్బ, పుచ్చలపల్లి, దొరువుకట్ట అల్లంపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖి పొర్లుకట్టలు తెగిపోయే స్థితిలో ఉన్నాయి. గోవిందపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్ ప్రవాహంతో గోవిందపల్లిపాలెం మత్స్యకారులకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.స్వర్ణముఖి బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో 13 గేట్లు తెరిచి నీటిని వదిలారు .తడ మండలం ఇరకం దీవిలోని పొలాలను పులికాట్ ఉప్పు నీరు ముంచెత్తింది.

వర్షాల నష్టం రూ.35 కోట్లు

వరుస వర్షాలకు రూ.35 కోట్లకు పైగా నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా. 11 మండలాల్లోని 69 గ్రామాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి.దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, వాకాడు, తడ, పెళ్ళకూరు మండలాల్లో 1821 హెక్టార్లలో వరి పంట నీటమునిగింది. అనధికారిక అంచనాల ప్రకారం 12 వేల ఎకరాలకు పైగా వరిపొలాలు దెబ్బతిన్నాయి.106 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు పాడయ్యాయి. చిట్టమూరులో ఒక రోడ్డు తెగిపోగా మరొకటి కోతకు గురైంది. వరద నీరు కాజ్‌వేలపై ప్రవహించడంతో మరో 30 రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్ అండ్ బీ రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ. 16.34 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 70 రోడ్ల మరమ్మతులకు రూ.82.76 లక్షలు అవసరమని అంచనా వేస్తున్నారు.

విద్యుత్ శాఖకు రూ. 17.43 కోట్ల నష్టం

గాలులు, వర్షాలకు 33 కేవీ ఫీడర్లు ఏడు, 33-11 కేవీ ఫీడర్లు 62 దెబ్బతిన్నాయి. అలాగే 33-11 కేవీ సబ్ స్టేషన్లు ఏడు, 11 కేవీ స్తంభాలు ఎనిమిది, ఎల్‌టీ స్తంభాలు ఎనిమిది చొప్పున కూలిపోయాయి. దెబ్బతిన్న పరికరాలు, సామగ్రి విలువ రూ. 14.2 లక్షలని.. మొత్తం మీద రూ. 17.43 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.



మాలాడిగుండం

కపిలతీర్థం



తలకోన



మొండోడి కోన



మంగళం

జలపాతాల పరవళ్లు

తిరుపతి నగరానికి పచ్చని కిరీటంలా కనిపిస్తుంది తిరుమల కొండ. పాతిక కిలోమీటర్ల దూరం నుంచి కూడా పవళించిన అనంత శేషుడిలా కనిపించే ఈ కొండల బారు రుతువు రుతువుకీ తన అందాలు మార్చుకుంటుంది. ఎండాలకాలం మొక్కలు మోడులై తెల్లని బండలు మెరుస్తూ దర్శనమిస్తుంది. వాన కురిస్తే పరచకుకున్న ఆకుపచ్చదనం కనువిందు చేస్తుంది. ఎడతెగని తుఫాను వానలతో కొండల్లోంచి జాలువారుతున్న వాగులు వంకలతో, దూకుతున్న



బీటీఆర్ కాలనీ

జలపాతాలతో శేషాచలం సౌందర్యవనంగా మారింది. కరకంబాడి నుంచి తలకోన దాకా కొండబారున ఎటు చూసినా పచ్చని అడవిలోంచి తెల్లని పాలనురగలా జారుతున్న జలపాతాలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ తిరుపతి, రేణిగుంట, చంద్రగిరి ప్రాంతాల నుంచి కనిపించే అందాలే. కొండలు ఎక్కి లోయల్లోకి దిగితే అనేక తీర్థాలు స్వాగతం పలుకుతాయి.

- స్టాఫ్ ఫోటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, తిరుపతి

జలపాతాల జీవకోన

తిరుపతి(జీవకోన),(అర్బన్)డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి జలపాతం కనువిందు చేస్తోంది. ఆలయం ఆనుకుని ఉన్న ఎత్తైన కొండ నుంచి జాలువారుతున్న ఈ జలపాతం లో భక్తులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేస్తున్నారు. మంగళంలోని బీటీఆర్ కాలనీకి ఆనుకొని ఉన్న అటవీప్రాంతంలో కూడా కొండల నుంచి వచ్చే నీరు జోరుగా దూకుతున్నాయి. సమీప ప్రజలు ఆ ప్రాంతానికి చేరుకొని స్నానమాచరిస్తున్నారు. ఈ జలధారలు కాస్త దూరం ప్రవహించి ఆ తరువాత మాయమైపోయి, భూ అంతర్భాగంలో ప్రవహిస్తూ కొండకిందన మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇళ్లమధ్య కాలువల్లో దూసుకెళ్తూ చెన్నాయిగుంట చెరువులో కలుస్తోంది. అలాగే జీవలింగేశ్వరస్వామి ఆలయం నుంచి తూర్పు దిక్కున 300మీటర్లు వెళితే మొండోడికోన దర్శనమిస్తుంది. ఈ ప్రాంతం ప్రస్తుతం జల సవ్వడితో సందడి చేస్తోంది. కొండగుట్టల్లో చెట్ల మధ్యలో నుంచి జలపాతం దర్శనమిస్తోంది. స్థానికులు వీటిని సందర్శించి జలకాలాడుతున్నారు. ఆ నీరు దిగువ భవనాల మధ్య నుంచి ప్రవహిస్తూ మంగళం చెరువులోకి చేరుతోంది. లీలామహల్ సర్కిల్ నుంచి కరకంబాడి దాకా ఉత్తరపు దిక్కున కొండల్లోంచి అనేక తావుల్లో పాలధారల్లాంటి జలధారలు కనిపిస్తున్నాయి. వానలు కురిసినపుడు మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.



జీవలింగేశ్వర స్వామి ఆలయం



అబ్బురపరిచే పెంచలకోన జలపాతం

వెంకటగిరి నియోజకవర్గం.. నెల్లూరు జిల్లా పరిధిలోని రాపూరు మండలం పెంచలకోన పరవళ్లు తొక్కుతోంది. 500 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు నుంచి స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో కిందికి దూకుతోంది.

- రాపూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారిసేవలో ప్రముఖులు



అశ్విన్, తమన్, ఓంకార్

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ మంత్రి బాలవీరాంజనేయస్వామి, ఆర్మీ ఏపీ, తెలంగాణ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ) మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, ఇంటర్ విద్య డైరెక్టర్, కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా, సినీ సంగీత దర్శకుడు తమన్, నటుడు అశ్విన్, నిర్మాత ఓంకార్ ఉన్నారు.

నిండుగా తిరుమల జలాశయాలు

- 2026 డిసెంబరు 15 దాకా సరిపడేంత నిల్వలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో తిరుమలలోని జలాశయాలు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం నీటి నిల్వలను బట్టి 2026 డిసెంబరు 15 వరకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.దాదాపు ఐదేళ్ల తర్వాత ఈస్థాయిలో డ్యాములు నిండటం ఇదే. ఇలానే మరో ఐదురోజులపాటు వర్షం కురిస్తే 2027 జనవరి వరకు సరిపడేన్ని నీళ్లు నిల్వచేయచ్చని భావిస్తున్నారు. వారం నుంచి తుఫాన్ ప్రభావంతో అడవుల్లో నుంచి పిల్ల కాలువల ద్వారా నీరు డ్యాముల్లో చేరుతోంది. ప్రస్తుతం పాపవినాశనం డ్యాం నుంచి మూడు ఇంచులు, గోగర్భ నుంచి రెండు ఇంచుల నీటిని దిగువకు వదులుతున్నారు.

నిండుతున్న మల్లిమడుగు

తిరుమలలోని మూడు డ్యాముల నుంచి నీరు ఓవర్‌ఫ్లో కావడంతో రెండు డ్యాముల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.గోగర్భం డ్యాం నుంచి దిగువకు వెళుతున్న నీరు అవ్వాచారి కోనలోయ నుంచి 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని మల్లిమడుగు డ్యాంకు చేరుతున్నాయి. అలాగే ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, పసుపుధార డ్యాముల నుంచి వెళుతున్న నీరు తుంబురకోనకు చేరి అక్కడి నుంచి మల్లిమడుగు డ్యాంకు ప్రవహిస్తున్నాయి.

తిరుమలలో ప్రదేశాల పేర్లు మార్చనున్న టీటీడీ

- సీఎం నుంచీ సానుకూల స్పందన

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) మరింత ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా తిరుమలలోని ప్రదేశాలు, రోడ్లు, వసతి సముదాయాల పేర్లను మార్చాలని టీటీడీ ఆలోచిస్తోంది. తిరుమల క్షేత్రం వైభవానికి కారకులైన ఆళ్వారులు, అన్నమయ్య, పురందరదాసు వంటి వాగ్గేయకారులు పేర్లను పెట్టాలని అనుకుంటున్నారు. ఇందుకోసం దాదాపు 50 పేర్లను ఇప్పటికే సిద్ధం చేశారు. తిరుమలలో అనేక వసతి సముదాయాలను ఇప్పటికీ ఏటీసీ, ఎంబీసీ, ఏటీజీహెచ్, హెచ్‌వీసీ, ఎస్ఎన్‌జీహెచ్ వంటి పేర్లతో పిలుస్తున్నారు. వీటికి ప్రసిద్ధుల పేర్లు పెట్టనున్నారు. మల్లంగుంట, మేదరమిట్ట అనే పేర్ల స్థానంలో కొత్త పేర్లు పెడతారు. అలాగే కొన్ని కూడళ్ల, రోడ్లకు కూడా ఆధ్యాత్మికవేత్తల పేర్లను పెట్టాలని భావిస్తున్నారు. ఈ పేర్ల వల్ల తిరుమలను సందర్శించే భక్తులు వారి చరిత్రను కూడా తెలుసుకుంటారని టీటీడీ భావిస్తోంది. పేర్ల మార్పు అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది.



కార్తీక పౌర్ణమి దీపోత్సవం

తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. మొదట యోగనరసింహస్వామి ఆలయం పక్కనే ఉన్న పరిమళం అర వద్ద కొత్త మూకుళ్లలో దీపాలను వెలగించారు. ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇచ్చారు. గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారిమేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళ మాత, బంగారుబావి, కళ్యాణమండపం, సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహ స్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయకమండపం, మహద్వారం, బేడిఆంజనేయస్వామి, వరాహస్వామిఆలయం, పుష్కరిణి వద్ద సుమారు వెయ్యి నేతి జ్యోతులను వెలిగించారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దళిత వ్యతిరేకి ఆదిమూలం: టీడీపీ

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దళిత వ్యతిరేకి అని ఆ నియోజకవర్గ టీడీపీ దళిత నాయకులు ఆరోపించారు. దళిత ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ దళితులపైనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడి అక్రమ కేసులు బనాయించారని ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీలో ఉంటూ టీడీపీలోకి వచ్చిన వెంటనే అధిష్ఠానం టికెట్ ఇచ్చిందని, తాము ఆయన గెలుపు కోసం శ్రమించామన్నారు. ఆయన చేసిన తప్పులతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. నాయకులు, కార్యకర్తల కోసం శంకర్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే ఆదిమూలం పెత్తందారీ పెత్తనం అంటూ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కులమతాలకు అతీతంగా శంకర్‌రెడ్డి పనిచేస్తూ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని చెప్పారు. వైసీపీ నుంచి వచ్చిన ఆదిమూలం ఇప్పటికీ ఆ పార్టీ వారికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ పారి చందన స్రవంతి, నాయకులు బి.జ్ఞానకుమార్, నెల్సన్ మండేలా, శ్రీనివాసులు, ధనశేఖర్, రమేష్, దశరదన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి డివిజన్ డిమాండ్



రైల్వే మంత్రి అశ్విన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధనసమితి నాయకులు, ఏపీ ఎంపీలు

తిరుపతి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు డిమాండ్‌ను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ దృష్టికి సాధన సమితి సభ్యులు తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పార్లమెంట్ టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌తో కలిసి గురువారం పార్లమెంట్‌లోని కేంద్ర మంత్రి ఛాంబర్‌లో వినతి పత్రం అందజేశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, లావు కృష్ణదేవరాయలు బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను రైల్వే మంత్రికి వివరించారు. 30 ఏళ్లుగా నెలకొన్న డిమాండ్‌ను పరిష్కరించాలని కోరారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి న్యాయ సముచితంగా అదనపు రైల్వే డివిజన్ ఏర్పాటు అవసరమన్నారు. యాత్రికుల తాకిడి పెరిగిన దృష్ట్యా తిరుచానూరు, రేణిగుంట,చంద్రగిరి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరారు. హైదరాబాద్ నుంచి గూడూరు వరకు వచ్చే సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను రేణిగుంట వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, వీసీ రాయల్, కేవీ చౌదరి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆలస్యంగా విమానాల రాకపోకలు

రేణిగుంట డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించక పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి. గురువారం ఉదయం హైదరాబాదు నుంచి వచ్చిన ఇండిగో విమానం తప్ప మిగిలినవన్నీ గంట నుంచి రెండు గంటలు వరకు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి.

26 నుంచి విద్యాపీఠంలో భారతీయ విజ్ఞాన సమ్మేళనం

- సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్ఎస్ఎస్ చీఫ్ రాక
- 29న ముగింపు రోజు ప్రధాని హాజరయ్యే అవకాశం

తిరుపతి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విద్యా పీఠంలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు భారతీయ విజ్ఞాన సమ్మేళనం జరగనుంది. ఆర్ఎస్ఎస్ అనుబంధ విభాగమైన విజ్ఞాన భారతి సంస్థ చేపట్టే ఈ కార్యక్రమం తొలిరోజు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు హాజరు కానున్నట్టు సమాచారం. ముగింపు వేడుకలకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశముంది. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాల్లో ఆరు సమ్మేళనాలు జరగగా ఏడవ సమ్మేళనం తిరుపతిలో జరిపేందుకు నిర్వాహకులు నిర్ణయించి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నైపుణ్యాల పెంపునకు పరిశ్రమలతో భాగస్వామ్యం

- వెటర్నరీ పీజీవిద్యార్థుల జాతీయసదస్సులో డాక్టర్ ప్రకాశ్‌రావు



సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతిరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఉపాధి, ఉద్యోగ నైపుణ్యాలను పెంచేందుకు పరిశ్రమలతో భాగస్వామ్యం ఎంతో అవసరమని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్స్ అండ్ ఫీడ్‌మిల్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ డీవీఆర్ ప్రకాశ్‌రావు పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా గురువారం 'ఇంపాక్ట్ ఆఫ్ వెటర్నరీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్స్ ఆన్ యానిమల్ హెల్త్ అండ్ ప్రొడక్టివిటీ' అంశంపై నిర్వహించిన జాతీయసదస్సులో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా మల్టీ డిసిప్లినరీ పరిశోధనలు రూపొందించాలన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధనలు రూపొందించడంపై పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు దృష్టిసారించాలని తెలిపారు. గౌరవఅతిథిగా హాజరైన విశాఖకి చెందిన అంకో సీక్ బయో సంస్థ చైర్మన్ డాక్టర్ పూసల సురేష్ మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధనల పురోగతికి ప్రయోగశాల, జంతువుల పాత్రని వివరిస్తూ..నాణ్యమైన పరిశోధనలు ఆవిష్కరించాలన్నారు. జీవోటీస్‌సంస్థ చైర్మన్ డాక్టర్ కిశోర్ ప్రయాగ, వర్సిటీ డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, వెటర్నరీసైన్స్ డీన్ డాక్టర్ ఆర్వీ సురేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య మాట్లాడారు. ప్రొఫెసర్ డాక్టర్ బి.రాంబాబునాయక్, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ వై.మురళీధర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నెంబరును ఫోనుచేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.

23, 29న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో డిసెంబరు 23న జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి), వైకుంఠ ఏకాదశి ముందురోజు 29వ తేది వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ గురువారం ప్రకటించింది. వైకుంఠ ద్వార దర్శనాలు జరిగే పదిరోజుల పాటు స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు వీఐపీ బ్రేక్‌ను పరిమితం చేసి సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను చేస్తున్నట్టు టీటీడీ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

బహుమతి పేరిట మోసం

- రూ.3.5 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేరగాళ్లు), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బహుమతి పేరు చెప్పారు. వివరాలన్నీ తెలుసుకుని ఆ వ్యాపారి ఖాతాలో రూ.3.5 లక్షలు లాగేసుకున్నారు సైబర్ నేరగాళ్లు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలోని ఓ వ్యాపారికి వారం కిందట గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. ఢిల్లీ నుంచి మాట్లాడుతున్నామని, మీరు ఆన్‌లైన్ ద్వారా ఇటీవల టీవీ కొన్నారు కదా? మేము తీసిన లక్కీ డ్రాలో మీకు ద్విచక్ర వాహనం బహుమతిగా వచ్చిందని చెప్పాడు. ఒకవేళ బహుమతి వద్దనుకుంటే, దానికి సరిపడా డబ్బును రెట్టింపుగా మీ అకౌంటులో జమ చేస్తామని నమ్మపలికారు. దానికోసం అకౌంటు నెంబరు, ఐఎఫ్ఎస్సీ కోడ్, ఆధార్ నెంబరు తదితర వివరాలు అడిగాడు. దీనిని నమ్మిన ఆ వ్యాపారి వాళ్లు అడిగిన వివరాలన్నీ చెప్పారు. ఆ తర్వాత మీకు అకౌంటులో డబ్బులు పడాలంటే ముందుగా మీరు కొంత నగదు చెల్లించాలని చెప్పాడా వ్యక్తి. దీంతో తన అకౌంటు నుంచి 10,000 పంపారు. ఆ తర్వాత వ్యాపారి అకౌంటులో ఉన్న దాదాపు రూ 3.45 లక్షలు కొట్టేశాడా సైబర్ నేరగాడు. మొబైల్‌కు వచ్చిన మెసేజ్ చూసి అవాక్కయిన వ్యాపారి లబోదిబోమంటున్నారు. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే అవమానమని మిన్నకుండిపోయారు. పోలీసులకూ ఫిర్యాదు చేయలేదు.

ఎంఎస్ఎంఈ పరిశ్రమలతో యువతకు మెరుగైన ఉపాధి

- సీఐఐ పార్టనర్ సమ్మిట్‌లో జిల్లాకు 61మందితో ఎంవోయూ కుదిరిందన్న కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు రాష్ట్రప్రభుత్వంతో 61మంది ఎంవోయూ కుదుర్చుకున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సీఐఐ భాగస్వామ్య సదస్సు పెట్టుబడిదారుల సమావేశం, జిల్లా పరిశ్రమయల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనతో యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా పరిశ్రమలశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. సింగిల్ డెస్క్ విధానం ద్వారా అక్టోబరు నుంచి 1,821 పరిశ్రమలకుగాను 1,755 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని మరో 56 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఇక 13 పరిశ్రమలకు ప్రోత్సాహకాలకు రూ.77.45లక్షలు అందించడానికి పరిశీలన కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో పెట్టుబడిదారులు, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరు చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

అందరి మద్దతుతో ఉద్యమం



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలందరి మద్దతుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళతామని గూడూరు జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. రోటరీభవన్‌లో గురువారం జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయడమో, లేక ప్రత్యేక జిల్లాగానో ప్రకటించాలన్నారు. ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలను కలుపుకుని శాంతియుత పోరాటాన్ని సాగిస్తూ ఇచ్చిన హామీని సాధించుకునేంత వరకు ముందుకు వెళతామన్నారు. జేఏసీ కార్యదర్శిగా చిరువెళ్ల సునీల్‌కుమార్, కోశాధికారులుగా నిరంజన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జమాలుల్లా, జాయింట్ సెక్రటరీగా నాగేశ్వరరావు, సభ్యులను ఎన్నుకున్నారు. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.






పవన్ పర్యటనలో..

చిత్తూరులో డీడీవో కార్యాలయాల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన - కూటమి పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశం - వాహనంలో నుంచే జనాలకు అభివాదం - తిరుపతి విమానాశ్రయం బయట వినతిపత్రాల పరిశీలన

స్నేహితుడి కుమార్తెనే చెరబట్టాడు!


అలెక్స్

గుడిపాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ యువతిని భయపెట్టి అత్యాచారం చేసిన తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన రౌడీ షీటర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వేలూరుకు చెందిన అలెక్స్ ఏడాది క్రితం మద్యం షాపు వద్ద పరిచయమైన స్నేహితుడి కోసం అప్పుడప్పుడూ గుడిపాలలోని ఓ ఎస్టీకాలనీకి వచ్చేవాడు. ఈ పరిచయంతో ఆ స్నేహితుడి కుమార్తెతోనే సంబంధం పెట్టుకున్నాడు. తరచూ ఇంటికి వచ్చిపోతూ ఎవరికెనా చెబితే చంపేస్తానని భయపెట్టేవాడు. అలెక్స్ ఆగడాలు శ్రుతి మించడంతో బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గురువారం అలెక్స్‌పై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలెక్స్ వేలూరు జిల్లాలో పేరుమోసిన రౌడీ షీటర్ అని, అతడిపై 50 కేసులకు పైగా ఉన్నాయని పోలీసుల విచారణలో తేలింది.

21న పల్స్ పోలియో కార్యక్రమం


శిక్షణ ఇస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు, పర్యవేక్షణా సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వున్న 0-5 లోపు ఉన్న పిల్లలందరికి పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. 0-5 పిల్లలు 2,21,502 మంది ఉన్నారన్నారు. వీరికి 14,730 పోలియో వయిల్స్ అవసరమన్నారు. 142 రూట్లల్లో 5794 బూత్‌ల ద్వారా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలే, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలను మానిటరింగ్ చేసుకోవాలన్నారు. మూడు రోజులు పాటు కార్యక్రమం జరుగుతుందని, మొదటి రోజు బూతుల్లో, రెండవ రోజు, మూడవ రోజు మిగిలిన పిల్లలకు ఇంటింటికి తిరిగి పోలీయో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఐవో హనుమంతరావు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం


చెక్కును అందిస్తున్న నాగమ్మ

ఐరాల(కాణిపాకం), డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద ట్రస్టుకు తిరుపతికి చెందిన టి.నాగమ్మ గురువారం రూ.5లక్షల చెక్కును విరాళంగా అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, చిట్టిబాబు పాల్గొన్నారు.

మణికంఠేశ్వరాలయంలో లక్ష బిల్వార్చన


బిల్వ పత్రాలను తీసుకొస్తున్న చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళ కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం మణికంఠేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చనను వైభవంగా నిర్వహించారు. ఈక్రమంలో ఉదయం ఆలయ చైర్మన్ మణినాయుడు ఆధ్వర్యంలో బిల్వపత్రాలను ప్రధాన ఆలయం నుంచి భక్తి శ్రద్ధలతో మణికంఠేశ్వర ఆలయానికి తీసుకొచ్చారు. ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌కు అందజేశారు. అనంతరం ఆలయంలో మణికంఠేశ్వరస్వామికి అభిషేకం నిర్వహించి స్వామికి లక్ష బిల్వార్చనను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

శివనామ స్మరణలతో గిరి ప్రదక్షిణ


బంగారు తిరుత్తణి కొండ గిరి ప్రదక్షిణలో భక్తులు

సోమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం సమీపంలోని బంగారు తిరుత్తణి కొండచుట్టు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివ నామసర్మణలతో గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం స్థానిక శివాలయంలో, వెంకటేశ్వరస్వామి పాదాల ఆలయం, వరసిద్ధి వినాయకస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం గిరిప్రదక్షిణలో స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తూ మార్గంలోని పలు చోట్ల భజన మండలి కోలాటాలతో సందడి చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

దక్షిణ మధ్య రైల్వేలో ఓటీపీ లింక్‌తో తత్కాల్ టికెట్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో ఇకపై ఓటీపీ లింక్‌తో తత్కాల్ టికెట్లు ఇవ్వనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం తిరుపతి నుంచి వివిధ మార్గాల్లో వెళ్లే వందేభారత్ రైళ్లలో ఈ పద్ధతి అమలు చేస్తున్నారు. 'ఆధార్‌తో లింక్‌అయిన ఫోన్ నెంబరు ఇవ్వాలి. టికెట్ బుక్ చేసే సమయంలో ఓటీపీ వచ్చాకే టికెట్ వస్తుంది' అని తెలిపారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సలహాలు, ఫిర్యాదులపై 0877 2263261 నెంబరును ఫోనుచేసి టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో మాట్లాడొచ్చు.



వైభవంగా సత్యనారాయణ వ్రతం


ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న ఈవో పెంచలకిషోర్, తదితరులు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయంలో గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత వరదరాజస్వామి మూల విరాట్‌కు ఘనంగా అభిషేకించారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణినాయుడు,ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై వరసిద్ధుడి కటాక్షం


వరసిద్ధుడిని శేష వాహనంపై ఊరేగిస్తున్న ఈవో పెంచలకిషోర్ తదితరులు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం రాత్రి కార్తీక దీపోత్సవాన్నివైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ కార్యక్రమానికి కాకర్లవారిపల్లెకు చెందిన గాలిసుబ్రహ్మణ్యంనాయుడు ఉభయదారుడిగా వ్యవహరించారు. ధ్వజస్తంభం వద్ద ఈవో పెంచలకిషోర్ దంపతులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ సిబ్బంది నేతి దీపాలను వెలిగించారు. రాత్రి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవమూర్తులను శేష వాహనంపై ఊరేగించారు. భక్తులు స్వామికి కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు డప్పుల శబ్దానికి లయబద్ధంగా నృత్యాలు చేస్తు స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై అటవీశాఖ నిఘా

● పసలకొండలో ట్రాప్ కెమెరాల ఏర్పాటు


ట్రాప్ కెమెరా ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఐరాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులు నిఘా పెంచారు. ఇటీవల పుత్రమద్ది దగ్గర ఉన్న పసలకొండ ప్రాంతంలో చిరుత పులి, పిల్లల దాడులు జరగుతుండటంతో డీఆర్వో రాకేష్‌కుమార్ పసలకొండ ప్రాంతంలో గురువాంం పలు చోట్ల కెమెరాలను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుతలకు హాని కలిగించడానికి ఉచ్చులు వేయరాదన్నారు. ఎక్కడబడితే అక్కడ విద్యుత్ తీగలను పెట్టడం, విష ప్రయోగం చేయడం వంటి పనులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాప్ కెమెరాలతో చిరుతలు ఎక్కడ ఉన్నాయన్న సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చునన్నారు. ఈ విషయాలను గుర్తుపెట్టుకుని చిరుతలు కనిసిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. ఎఫ్‌బీవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.13 కోట్లతో ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామాల కింద ఎంపిక చేసిన ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జడ్పీ నిధులు రూ.13 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి స్వామిత్వ సర్వే, ఆధార్ కార్డు నమోదు, పారిశుధ్యం, వర్షాకాలంలో వస్తున్న వ్యాధులపట్ల ప్రజలకు అవగాహన, గ్రామ, వార్డు సచివాలయాల్లో అమలవుతున్న పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఆదర్శ యోజన ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో తొలివిడతగా ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. జిల్లాస్థాయిలో ఒక పోర్టల్‌ను డిజైన్‌చేసి పనుల ప్రగతిని పరిశీలిస్తున్నామన్నారు. పంచాయతీ పరిధిలోని ప్రతి ఇల్లు, ప్రభుత్వ, ప్రైవేటు గృహాల యజమానుల వివరాలు స్వామిత్వ సర్వే ద్వారా అప్‌డేట్ చేయాలన్నారు. వీటితో పాటు పొరంబోకు స్థలాలు, రోడ్లు, బోర్లు, బావులు, డ్రైయిన్ల అసెస్‌మెంట్‌లను నమోదు చేయాలన్నారు. సక్రమంగావున్న ఆస్తులకు నోటీసులు జారీచేసి 30 రోజుల్లోగా అభ్యంతరాలు పొందాలన్నారు. డీపీవో ప్రభాకర్ రావు, డీఎల్‌డీవో రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి 8 ఎకరాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి):మంగసముద్రం గ్రామంలో సర్వేనెం. 167, 168/1ఏ, 169/1, 171 ల్లోని 8.08 ఎకరాల ప్రభుత్వ భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీ)కి ఉచితంగా ప్రభుత్వం కేటాయించింది. ఈమేరకు గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ భూమి విలువ సుమారు రూ.2.77 కోటు ఉంటుందని అంచనా. కలెక్టర్ సుమిత్‌కుమార్ అభ్యర్థన మేరకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (మంగళగిరి) ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచింది. ప్రభుత్వం పరిశీలించి స్థలం కేటాయిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం: దగ్గుమళ్ల



చిత్తూరు సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సహకారంతో చిత్తూరు పార్లమెంటు సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. గురువారం ఢిల్లీలో పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ తోడ్పాటు అందిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. 2024-29 సంవత్సరాలకు 'ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ 4.0ని ఎన్డీయే సర్కార్ సహకారంతో ఏపీ ప్రారంభించిందన్నారు. 20 వేల కొత్త స్టార్టప్‌లను, లక్ష ఉద్యోగాలను సృష్టించడమే ఈ పాలసీ లక్ష్యమని ఎంపీ వివరించారు.

అఖండ-2 సినిమా టికెట్ రూ.5 లక్షలకు కొన్న ఎమ్మెల్యే


బాలకృష్ణ అభిమానుల నుంచి టికెట్ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ -2 సినిమా టికెట్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ రూ.5 లక్షలకు కొనుగోలు చేశారు. గురువారం చిత్తూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాలకృష్ణ అభిమానులు ఎమ్మెల్యే ను కలసి సినిమా టికెట్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలకృష్ణ అభిమానిగా సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నానని చెప్పారు. బాలకృష్ణ అభిమానుల కోరిక మేరకు నగరంలో బస్‌షెల్టర్ నిర్మాణం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి నాయుడు, చిత్తూరు నగర అధ్యక్షుడు ఎల్‌డీ నాయుడు, అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంవీఆర్ కళాశాల విద్యార్థిని


ప్రవీణ

గంగవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ప్రవీణ సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెలలో తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో జరిగిన వాలీబాల్ పోటీలకు ప్రవీణ హాజరై ఉత్తమ ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి చెన్నైలో జరిగే సౌత్‌జోన్ (మహిళల) వాలీబాల్ పోటీలకు ఎస్వీ యూనివర్శిటీ టీమ్ తరపున పాల్గొంటుందన్నారు. విద్యార్థిని ప్రవీణను కళాశాల కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, అధ్యాపకులు అభినందించారు.

నేటినుంచి వ్యవసాయ వర్సిటీ క్రీడా సాంస్కృతిక పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో శుక్రవారం నుంచి క్రీడా సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు స్టూడెంట్ అఫైర్స్ డీన్ జి.రామచంద్రరావు తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచి 642 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

నేడు గరికపాటి ప్రవచనాలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు కాళహస్తీశ్వర శతక ప్రవచనాలు వినిపిస్తారు. కార్యక్రమాన్ని నారాయణీ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని నగరవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంస్థ నిర్వాహకులు చిరంజీవి ఒక ప్రకటనలో కోరారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో సీజనల్ వ్యాధుల నియంత్రణ, వైద్య, ఆరోగ్య సేవలు, ధాన్యం సేకరణ, ఎరువుల పంపిణీ, ప్రభుత్వ సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయి, ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలు తదితర అంశాలపై వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు.

ఎన్‌ఎంయూఏకు శాశ్వత సభ్యత్వంపై సంబరాలు



డిపో ఎదుట సంబరాలు జరుపుకుంటున్న నాయకులు, ఉద్యోగులు

కుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూఏ)కు జీవో 120 ద్వారా రాష్ట్రస్థాయి జాయింట్ స్టాఫ్ స్టాండింగ్ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం ఇచ్చిన సందర్భంగా కుప్పం ఆర్టీసీ డిపోలో ఆ యూనియన్ వర్గాలు గురువారం హర్షం వ్యక్తం చేశాయి. మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే తమ యూనియన్ ఏపీఎస్ ఆర్టీసీలో అతిపెద్ద అసోసియేషన్‌గా ఉన్న విషయం గుర్తు చేశారు. దీంతోపాటు ఏపీ పీటీడీలో శాశ్వత సభ్యత్వం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ.రమణారెడ్డికి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావుకు, సహకరించిన అధికారులకు, ఎమ్మెల్యేలకు, ఏపీ ఎన్జీవో నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక ప్రయోజనాల పరిరక్షణకు ఇకపై మరింత బాధ్యతతో నిబద్ధమై ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్‌ఎంయూఏ జోనల్ కమిటీ సభ్యుడు జి.రహంతుల్లా, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్ కుమార్, కార్యదర్శి ఈ.జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, ఎస్వీ.శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షుడు కె.దిలీప్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.జయశంకర్, గ్యారేజ్ కార్యదర్శి యు.మొగిలీశ్వరయ్య, పోతురాజు, బ్రహ్మం, ఉదయ్, కేఆర్.కుమార్, ఆర్టీసీ.సురేశ్, ప్రచార కార్యదర్శి ఎం.బాలకృష్ణ, ఎస్ఆర్.రాజా, వెంకటయ్య, ఎంసీ.నాయక్, రమణ, చంద్రకళ, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

రహదారిపై తొలగిన ముళ్లపొదలు



పిచ్చిమొక్కలు తొగించడంతో
కొత్తరూపు సంతరించుకున్న రామాపురంతండా రహదారి

రామకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం 89పెద్దూరు-రామకుప్పం రహదారి నుంచి రామాపురంతండాకు వెళ్లే రహదారిలో దశాబ్ద కాలంగా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి రహదారి మూసుకుపోయింది. దీంతో ఈ రహదారిలో రాకపోకల విషయంలో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. ముళ్లపొదలతో రహదారి కుచించుకుపోయింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. తరచూ ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని వాహన చోదకులు ప్రమాదాల బారిన పడ్డారు. విషయాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే రహదారికి ఇరువైపులా ముళ్లపొదలను తొలగించాలని టీడీపీ మండల నేతలను ఆయన ఆదేశించారు. గురువారం టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్ తదితరులు రామాపురంతండా రహదారిని పరిశీలించారు. రహదారికిఇరువైపులా ముళ్లపొదలను తొలగించారు.

ఈ-సైకిల్ వాడకంతో ఆరోగ్యం



ఈ-సైకిల్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నేతలు

రామకుప్పం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ-సైకిల్ వాడటంతో శారీరక ఆరోగ్యం సమకూరడమే కాకుండా, ఇంధన వ్యయం ఆదా అవుతుందని రామకుప్పం అసిస్టెంట్ ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, కడా పీఏసీ సభ్యుడు రఘులు తెలిపారు. గురువారం మండల సచివాలయంలో ఈ-సైకిల్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాలను కాలుష్య రహితంగా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం ప్రజలకు చౌకధరకు, వాయిదాల పద్ధతిలో ఈ-సైకిళ్లను అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రామకుప్పం గ్రామసచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, టీడీపీ బూత్ ఇన్‌చార్జి మంజునాథ్ సచివాలయ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ వడ్డెర సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు భానుమూర్తి, నేతలు మురళీ, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పీటీఎంను విజయవంతం చేయండి



చల్లా బాబును కలిసిన ఉపాధ్యాయులు

రొంపిచెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని గురువారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మీ, అమరశేఖర్, రెడ్డిప్రదీప్, సుజాత, టీడీపీ మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ పాల్గొన్నారు.

9 మంది క్షేత్ర సహాయకులకు జీతాలు నిలిపివేత



మాట్లాడుతున్నఎంపీడీవో ఏపీఆర్ కుమార్

శాంతిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీలో విధులు నిర్వహిస్తున్న 9 మంది క్షేత్ర సహాయకులకు డిసెంబరు నెల జీతాలు నిలిపివేసినట్లు ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 'క్షేత్ర సహాయకులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని హెచ్చరించినా పాటించకపోవడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఆపన్నులకు ఆపద్బాంధవుడు చంద్రబాబు నాయుడు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు
అందుకున్న లబ్ధిదారులతో టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ అండగా తానున్నానంటూ ఆపన్నులను ఆదుకుంటున్న ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు అని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి తెలిపారు. గురువారం రామకుప్పం మండలంలోని 11 మంది లబ్ధిదారులకు రూ.8.16 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి , ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, తెలుగు యువత మండల అధ్యక్షుడు బాలకృష్ణ, మైనారిటీసెల్ మండల అధ్యక్షుడు ఆదిల్, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి మురళీమోహన్ తదితర నేతలు పాల్గొన్నారు.

సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి



రొంపిచెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని సచివాయాల డిప్యూటీ ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. గురువారం రొంపిచెర్ల సచివాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

టీడీపీ పూర్వ వైభవానికి ప్రత్యేక చర్యలు



సోమలలో పాల్గొన్న టీడీపీ నేతలు

సోమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో స్థానిక ఎన్నికల్లో టీడీపీ పూర్వ వైభవానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పరిశీలకుడు నౌషాద్, సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం సోమల పంచాయతీలోని బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పార్టీ పరిస్థితిపై నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు శివ శంకర్, సోమల టీడీపీ అధ్యక్షుడు మహేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్యగంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



ఆలయ హుండీని లెక్కిస్తున్న భక్తులు, అధికారులు

పలమనేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సత్య గంగమ్మ ఆలయ హుండీని గురువారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. భక్తులు అమ్మవారికి కానుకల రూపంలో ఆలయానికి రూ.1,81,042 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి కమలాకర్, ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని పలు పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మల్లికార్జున కోరారు. రామకుప్పం ఉర్దూ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రం, ఉర్దూ, కొంగనపల్లె, 89పెద్దూరు, బగళనత్తం ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) పోస్టులకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. ఈ పోస్టులకు డిగ్రీ, బీఈడీ అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటల లోపు రామకుప్పం ఎంఆర్‌సీలో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గంగవరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మదర్ థెరిసా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం మేలుమాయి గ్రామంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఏడురోజుల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా రెండోరోజు ఇంటింటా పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, ఎన్ఎస్ఎస్ అధికారి దేవేంద్రరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రాతివారిపల్లెలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం సందర్శించారు. అయ్యప్ప మాలధారణ చేసిన ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మాలధారణ చేశారు.

డీడీవో కార్యాలయాలతో సత్వర సేవలు

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం



కుప్పంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు



పలమనేరు: కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డీడీవో కార్యాలయాలతో ప్రజలకు మరింత సేవలు అందుతాయని.. సమస్యలకు తక్షణ పరిష్కారం దొరుకుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. పలమనేరులోని వెలుగు కార్యాలయంలో గురువారం డీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చిత్తూరు నుంచి ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించి కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రామచంద్ర, ఏపీవో ధనలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, చౌడేపల్లి, సోమల, పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న, పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యగౌడు, టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కిషోర్ గౌడు, కుట్టి, నాగరాజరెడ్డి, జగదీష్ నాయుడు, వెంకటమునిరెడ్డి, ఖాజా, నదీం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కుప్పం:** కుప్పం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ (డీడీవో)ను గురువారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని సీసీఎల్ఆర్ భవనంలో ఈ కార్యాలయం ప్రారంభించిన అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం మాట్లాడారు. కుప్పం ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందుతాయన్నారు. కార్యక్రమంలో కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన వెంకట రమణ

పుంగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు - రామసముద్రం మార్గంలో ద్విచక్రవాహనం నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి పుంగనూరు సమీపంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన తిమ్మన్న కుమారుడు వెంకట రమణ(46) ద్విచక్రవాహనంలో పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ శాంతినగర్‌లోని బంధువుల ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి గాయపడిన వెంకటరమణను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

బోయకొండలో శాస్త్రోక్తంగా చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చౌడేపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మ వారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని గురువారం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద ఆశీర్వాద మండపం వద్ద కలశ స్థాపన చేసి అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూల మంత్రాన్ని భక్తులచే పఠింప చేసి, సహస్ర కుంకుమార్చన చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏకాంబరం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో దత్తాత్రేయ జయంతి



అలంకరణలో షిరిడి సాయిబాబా

కుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం హెచ్‌పీ రోడ్డులో వెలసిన షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం దత్తాత్రేయ జయంతిని వైభవంగా నిర్వహించారు. బాబాకు ఉదయమే అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఆయనతోపాటు ఆలయంలోని అన్ని దేవతామూర్తులకు అభిషేకం చేశారు. గణపతి హోమం, మృత్యుంజయ హోమం, గురు దత్తాత్రేయ హోమం, వాస్తు హోమం నిర్వహించారు. దత్తాత్రేయలస్వామి, సాయిబాబాకు క్షీరాభిషేకం చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

రామకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి, స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అర్చనలు చేయించారు. రాత్రి ఆలయ పురోహితులు స్వామి వారికి రుద్రాభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీవారి గరుడ సేవ



గరుడ వాహనంపై విహరిస్తున్న
కల్యాణ వెంకటరమణస్వామి

పుంగనూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం రాత్రి వేద పండితులు వైభవంగా గరుడ సేవ నిర్వహించారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఆలయంలో కల్యాణ వెంకటరమణస్వామి, భూదేవి, శ్రీదేవిలకు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో గరుడ వాహనంపై శ్రీవారిని ఊరేగించగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, వారి కుటుంబీకులు వ్యవహరించగా కార్యక్రమంలో టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి , పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నడింపల్లెలో ఉచిత వైద్యసేవలు

సోమల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో గురువారం నడింపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్ , సర్పంచి కర్రి వెంకటరమణ, సీతారామయ్య, గిరిధర్ వైద్యసిబ్బంది, విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, పీవో గౌతం పాల్గొన్నారు.

పశువులకు బూటాక్స్ పిచికారీ



పశువులకు మందులు పిచికారీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పలమనేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం గడ్డూరు గ్రామంలోని పశువులకు బూటాక్స్ మందును పిచికారీ చేశారు. గ్రామంలో నిర్వహించిన స్పెషల్ క్యాంపులో భాగంగా పశువులు పిడుదులు, దోమలు, ఈగల నుంచి రక్షణ పొందేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పాడిరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారితోపాటు కళాశాల డెయిరీ టెక్నాలజీ అధ్యాపకులు సి.దిలీప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.వెంకటేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి చక్రాల కుర్చీల వితరణ



ఆస్పత్రికి చక్రాల కుర్చీలను అందించిన కాఫీబుడ్డీ బృంద సభ్యులు

పలమనేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కాఫీబుడ్డీస్ మిత్రబృందం గురువారం పలమనేరు ఏరియా ఆస్పత్రికి వీల్‌ఛైర్స్, స్ట్రెచర్స్‌ను వితరణగా అందజేశారు. కాఫీబుడ్డీస్ వార్షికోత్సవం సందర్భంగా రోగుల సౌకర్యార్థం అందించారు. అనంతరం వారు ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, కాఫీ బుడ్డీస్ అధ్యక్షులు భాస్కర్‌యాదవ్, ఆస్పత్రి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్, కాఫీబుడ్డీస్ సభ్యులు లక్ష్మీపతి యాదవ్, డాక్టర్ యుగంధర్, నరేంద్ర, పూల లోకేష్ నాయుడు, బీఆర్సీ కుమార్, ఫయాజ్, చెంగారెడ్డి, ఎస్ఎంటీ నూర్, ప్రదీప్‌కుమార్, సీఎంసీ హరి, ప్రవీణ్, కిషోర్, గణేష్, సతీష్, స్వామి, శ్రీనివాసులు, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి ప్రత్యేకాలంకరణ



పుంగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని కాళికా కమటేశ్వర, వీరబ్రహ్మేంద్రస్వామి, దత్తాత్రే యస్వామి ఆలయాల్లో గురువారం దత్తజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో దత్తాత్రేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే పుంగమ్మచెరువు 50 రాళ్లమొరవ వద్ద దత్తాత్రేయస్వామికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చనుకంటి శేషాద్రి, ప్రముఖులు భక్తవత్సలరాజు, కృష్ణమాచారి, రమణాచారి, భాను తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే సీఎం లక్ష్యం



సర్వేను పరిశీలించిన ఎంపీడీవో కుమార్

శాంతిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కడా ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటింటి సర్వేను ఎంపీడీవో కుమార్ గురువారం పరిశీలించారు. మండల పరిధిలోని కడపల్లె గ్రామంలో సచివాలయ అధికారులు ఇంటింటికి వెళ్లి నిరుద్యోగుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో అధికారులు ఈశ్వరన్న, పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా, సచివాలయ సిబ్బంది, నాయకులు దొరస్వామి, పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



రాళ్ళబూదుగూరులో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను
ప్రారంభిస్తున్న రెస్కో డైరెక్టర్ బసవరాజు

శాంతిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని రెస్కో డైరెక్టర్ బసవరాజు అన్నారు. మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే రైతుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో చిన్నారిదొడ్డి పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, బూత్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రెస్కో సిబ్బంది వెంకటేష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో సుదర్శన హోమం



తవణంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం కార్తీకపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.

గుంతలమయమైన సంతపేట రోడ్డు



చిత్తూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంతపేట రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇటీవల వర్షాలకు నీవానది పొంగి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోజూ ఈ గుంతల్లో పడి ప్రయాణికులు ఆస్పత్రులు పాలవుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా నగరపాలక అధికారులు పట్టించుకోవడం లేదని, కాలువ నిర్మించాక రోడ్డు వేస్తామని చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు.. చిత్తూరు నుంచి కాణిపాకం, తవణంపల్లి, ఐరాల ఇలా అనేక మండలాలకు ఇదే ప్రధాన రహదారి. గుంతలు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెడల్పు చేయడం మంచిదే కానీ అన్ని పూర్తయ్యాక రోడ్డు వేస్తామనడం సమంజసం కాదని స్థానికులు అంటున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ తీసుకొని రోడ్డు కనీస మరమ్మత్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఐరాల: మండల కేంద్రంలో వేసిన మూడు నెలలకే రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండటంతో ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేశారు. దీంతో బీటీ రోడ్డు సుందరంగా తయారైంది. కూతవేటు దూరంలోని రెడ్డివారిపల్లె వద్ద రోడ్డు మాత్రం కుచించుకుపోయింది. ఈ మార్గంలో కాణిపాకం వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా గుంతను పూడ్చకపోతే ప్రమాదం జరిగే అవకాశముంది

కూలిన ఇంటితో కష్టాలు



కూలిన గోడ వద్ద బాధితురాలు సిద్ధమ్మ

శ్రీరంగరాజపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి దిగువ ముద్దికుప్పం గ్రామానికి చెందిన సిద్ధమ్మ పూరి గుడిసె గోడ కూలిపోయింది. వెంకటాపురం పంచాయతీ పొదలపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్‌కు చెందిన ఇంటి గోడ కూలిపోయింది. ఇంట్లో వస్తువులు దెబ్బతిన్నాయి. బాధితురాలు మాట్లాడుతూ తనకు ఇద్దరు కుమారులున్నారని, ఉండటానికి సరైన ఇల్లు లేదని వాపోయింది. పాత ఇల్లు ఉసురుతోందని, గోడ కూలిపోయిందని వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని, ఇల్లు మంజూరు చేయాలని బాధితులు కోరుతున్నారు.

పీఎంఏవైని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం ఉండి నిరుపేదలైన వారు పీఎంఏవై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడులు సూచించారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఈ పథకం కింద కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.లక్ష అందిస్తుందన్నారు. ఈ నెల 14లోగా సమీప పంచాయతీ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సర్పంచ్ గుర్రప్పనాయుడు,మాజీ సర్పంచ్ రవినాయుడు, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న కల్యాణి

చిత్తూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు రీ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కల్యాణి అన్నారు. గురువారం తాళంబేడులో రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్న రైతులు భూ సమస్య పరిష్కారానికి కలిసి రావాలన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలో ఉన్న రైతు ఒక్కరు రాకున్నా సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు తెలుసుకునేందుకుకే స్వయంగా వచ్చి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వివరించారు. పలువురు రైతుల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, హెచ్‌ఎం గోపినాథరెడ్డిలు అన్నారు. గురువారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన దగ్గర విద్యను అభ్యసిస్తున్న వారికి క్రమశిక్షణతో నాణ్యతతో కూడిన విద్యాను అందించడమే లక్ష్యంగా పని చేద్దామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సుగుణేంద్ర తీర్థుల ఆరాధనోత్సవాలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గిరింపేట బ్రాహ్మణవీధి మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో సుగుణేంద్ర తీర్థుల ఆరాధనోత్సవాలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి వారికి నిర్మాల్య విసర్జన, పాద, కనక పూజలు, పహ్లో పంచామృత సేవ, తులసీ అర్చన, పుష్ప అలంకారం, హస్తోదకం, హరతులు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులకు మఠం నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సచివాలయంలో పరికరాల చోరీ

గుడిపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏఎల్.పురం సచివాలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కంప్యూటర్, ప్రింటర్లను దుండగులు తీసుకోపోయారని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. సచివాలయ వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఒంటరితనం భరించలేక కూలీ ఆత్మహత్య



మృతి చెందిన తిరువేలన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 4: ఒంటరితనాన్ని భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకటవ పట్టణ పోలీసుల వివరాల మేరకు.. కొంగారెడ్డిపల్లెలోనిషౌకార్‌పేటకు చెందిన తిరువేలన్(42) కూలి పనిచేసుకుని జీవిస్తున్నాడు. కొంత కాలం క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నాడు. భార్య వెళ్లిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. పోలీసులు వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శాస్త్రోక్తంగా కొండ చుట్టు ఉత్సవం



వెదురుకుప్పం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్ ఖండ్రిగ సమీపంలో కొండమల్లీశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి కొండ చుట్టు ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కొండ చుట్టు ప్రదక్షిణం చేశారు.

సీఎం సహాయనిధి అందజేత



బాధితునికి చెక్కు అందిస్తున్న బాలాజీ

నగరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల పాలిట పెన్నిధిగా నిలుస్తోందని నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ పేర్కొన్నారు. తన ఛాంబర్‌లో గురువారం ఆయనగుండ్రాజుకుప్పం ఆది ఆంధ్రవాడకు చెందిన మురళికి రూ. 50 వేల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సిఫార్సు ఆధారంగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ బాధితునికి బాసటగానిలుస్తోందని బాలాజీ తెలిపారు. సర్పంచ్ జయపాల్, అలెక్స్ రవిరాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు తూగుండ్రంలో థామస్ పర్యటన

గంగాధరనెల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ శుక్రవారం రెండు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఎంఈవో ఆంజినేయులుశెట్టిలు తెలిపారు. ప్రభుత్వవిప్ ఉదయం 10 గంటలకు తూగుండ్రం హైస్కూల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరవుతారు. మధ్యాహ్నం 2గంటలకు పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నారని వారు పేర్కొన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాలసముద్రం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణజిమ్మాపురంలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజు ఆలయంలో గురువారం కార్తీక దీపోత్సవంలో భాగంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు శివుని ఆకారంలో దీపాలు వెలిగించారు. వేడుకలను తిలకించడానికి మండల వాసులతో పాటు తమిళనాడు నుంచి భక్తులు వచ్చారు. భక్తులకు ఆలయ ధర్మకర్త బాలయ్యనాయుడు కుటుంబ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ



గంగాధరనెల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలకు ఏర్పాట్లు చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1091కు కాల చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అనురాధ, సంగీత, ఎన్‌జీవో ప్రతినిధులు రామారావు, అనీషాలు సూచించారు. తూగుండ్రం హైస్కూల్ విద్యార్థినులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ యువతులకు 18ఏళ్ళు నిండితే మానసికస్థితి అన్నివిధాల సహకరిస్తుందన్నారు. ఎన్‌జీవో ప్రతినిధులు రామారావు, అనీషా, అంగన్‌వాడీ టీచర్లు గీత, గుణసుందరి, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



వడివేలుకు చెక్కును అందిస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన వడివేలుకు ప్రభుత్వం తరపున గురువారం మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ రూ.40 వేల చెక్కును అందించారు. కార్వేటినగరం పంచాయతీ కోటచెరువు గ్రామానికి చెందిన బాధితునికి కలెక్టర్ ఇచ్చిన చెక్కును రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్ కోటచెరువులో అందజేశారు.

చేదెక్కుతున్న చెరకు సాగు



రామాపురంలో ట్రాక్టర్లకు ఎక్కిస్తున్న చెరకు

గుడిపాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో నానాటికీ చెరకు సాగు తగ్గుతోంది.. చిత్తూరులో చక్కెర ఫ్యాక్టరీ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడలేక ఈసాగుపై ఆసక్తి చూపడంలేదు. ఫ్యాక్టరీ ఉన్న సమయంలో మండల వ్యాప్తంగా సుమారు 3 వేల హెక్టార్లలో సాగు చేసేవారు. ఇందులో 30 శాతం పంటను గానుగ ఆడి బెల్లం తయారు చేసే వారు. చక్కెర ఫ్యాక్టరీ మూతబడ్డాక చెరకు సాగు గణనీయంగా తగ్గుతూ వస్తోంది. పదుల సంఖ్యలో మాత్రమే పండిస్తున్నారు. ఫ్యాక్టరీ లేక తమిళనాడులోని పళ్లిపట్టుకు తరలిస్తున్నారు. ఇక్కడ టన్నుకు రూ.3 వేలు ఇస్తున్నట్లు రైతులు తెలిపారు. నష్టం వచ్చినా అమ్మకతప్పడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి ఈ పంటను పండించ లేమని రైతులు చెబుతున్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి



పాలాభిషేకంలో ఆలయ ట్రస్టీలు సాయి కృష్ణారెడ్డి, సీకే లావణ్యబాబు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు4: నగరంలోని కట్టమంచి షిరిడి సాయి విశ్వసాయి ఆలయంలో గురువారం దత్తాత్రేయ జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టీలు సీకే. లావణ్యబాబు, సీకే.సాయి క్రిష్ణారెడ్డిలు భక్తులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. మందిరంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కట్టమంచి రెడ్డీస్ కాలనిలోని షిర్డి సాయిబాబా మందిరంలో ట్రస్టీ రాందాస్ నేతృత్వంలో దత్తాత్రేయ జయంతి పూజలు జరిగాయి. కుమ్మర వీధి, న్యూ కలెక్టరేట్ , కొంగారెడ్డిపల్లె దుర్గానగర్ కాలనీలోని సర్వసిద్ధి వినాయక, సంతపేట, విజయలక్ష్మీ కాలనీల్లో ఈవేడుక నిర్వహించారు.

గ్రామాభివృద్ధికి డీడీవో వ్యవస్థ దోహదం



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నింద్ర, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం, గామ పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా డీడీవో కార్యాలయాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు డివిజనల్ అభివృద్ధి అధికారి ఇందిరమ్మ చెప్పారు. గురువారం నింద్రలోని సీఎల్ఆర్సీ భవనం కార్యాలయ ఆవరణలో నగరి డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్ స్థాయిలో మినీ కలెక్టరేట్లు తరహాలో డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. డివిజన్ పరిధిలో అధికారుల పర్యవేక్షణలో గ్రామాలు అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనుపమ, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీపీ దుర్గాదేవి, మల్లికార్జున్ నాయుడు, ఎంపీడీవోలు, నాయకులు వెంకటేశ్వరరావు, రవినాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండలశాఖ కార్యవర్గం




సుబ్రహ్మణ్యం పిళ్లై- రంగనాథం,

యాదమరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగాగా సుబ్రహ్మణ్యం పిళ్లై, గౌరవ అధ్యక్షుడిగా గుణశేఖరన్, ప్రధాన కార్యదర్శిగా రంగనాథం, జిల్లా కౌన్సిలర్లుగా గణపతి, రమేష్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎన్. బాషా, ఓబుల్ రెడ్డి, లోహితానంద వల్లి, కార్యదర్శులుగా మణిరెడ్డి, తులసీరామ్, సీపీఎస్ కన్వీనర్‌గా నాగభూషణం, మహిళా కన్వీనర్‌గా ఉమ, మహిళా కార్యదర్శులుగా ప్రమీల కుమారి, కస్తూరి, లక్ష్మి, రేవతి, మల్లీశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ శాఖ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్, రాష్ట్ర కమిటీ కన్వీనర్ దేవరాజులు రెడ్డి కార్యవర్గాన్ని అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. గురువారం రాత్రి మారేపల్లి కాలనీలో ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలోఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే పల్లెనిద్ర సంకల్పమని వివరించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.మండల అధ్యక్షుడు మోహన్‌మురళి, సింగిల్‌విండో ఛైర్మెన్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ అన్నురాసి పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో దీపారాధన



కోదండరాముని గరుడ సేవ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నగరంలోని దొడ్డిపల్లె సప్త కన్నికల ఆలయంలో శుక్రవారం తమిళ కార్తీకమాస పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి పూజల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, స్టేట్ మొదిలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, కాజూరు బాలాజి, వసంత్‌లు పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు గోపాల క్రిష్ణన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్తీక దీపారాధనలో భక్తులు కోటి దీపాలు వెలిగించారు. కోదండ రామాలయంలో మార్గశిర మాస మహా అఖండ దీపారాధనలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. స్వామి గరుడసేవలో ఊరేగారు.పూజల్లో చుడా ఛైర్మన్ కఠారి హేమలత, ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడులు పాల్గొని స్వామి అమ్మవార్లకు పూజలు చేశారు. వారికి అర్చకులు, ఈవోలు తీర్థప్రసాదాలు అందజేశారు. అంకాల పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక అభిషేకం చేశారు.

ఏరియా ఆస్పత్రికి చక్రాల కుర్చీల వితరణ



ఆస్పత్రికి చక్రాల కుర్చీలను అందిస్తున్న దాతలు

పలమనేరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కాఫీబుడ్డీస్ మిత్రబృందం గురువారం పలమనేరు ఏరియా ఆస్పత్రికి వీల్‌ఛైర్స్, స్ట్రెచర్స్‌ను వితరణగా అందజేశారు. కాఫీబుడ్డీస్ వార్షికోత్సవం సందర్భంగా రోగుల సౌకర్యార్థం అందించారు. అనంతరం వారు ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ మమతారాణి, కాఫీబుడ్డీస్ అధ్యక్షులు భాస్కర్‌యాదవ్, ఆస్పత్రి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్, కాఫీబుడ్డీస్ సభ్యులు లక్ష్మీపతి యాదవ్, డాక్టర్ యుగంధర్, నరేంద్ర, పూల లోకేష్ నాయుడు, బీఆర్సీ కుమార్, ఫయాజ్, చెంగారెడ్డి, ఎస్ఎంటీ నూర్, ప్రదీప్‌కుమార్, సీఎంసీ హరి, ప్రవీణ్, కిషోర్, గణేష్, సతీష్, స్వామి, శ్రీనివాసులు, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో అనుపమ

విజయపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీవో అనుపమ గురువారం పరిశీలించారు. కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, కరెంటు, మరుగుదొడ్లు వంటి అంశాలను ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నట్టు తెలిపారు. తహసీల్దార్ కిరణ్, చాముండేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పల్లకీ సేవ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం సత్యసాయి బాబకు మార్గశిర మాస పౌర్ణమి పల్లకి సేవలను సత్యసాయి సేవాసమితి భక్త బృందం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలను సత్యసాయి సేవాసమితి భజన మండలి, మహిళా మండలి సభ్యులు బృందం భజన గానం అలరించింది. కార్యక్రమంలో నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పులిగుండు గిరిప్రదక్షిణ



పెనుమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పులిగుండు వద్ద వెలసిన పార్వతీపరమేశ్వర్లు గురువారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షిణలో భాగంగా కొత్త రోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా పులిగుండు శివాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు షణ్ముగరెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1.72 లక్షలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): గిరంపేట చెంగల్‌రాయకొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీనగురువారం లెక్కించారు. రూ.1.72లక్షల నగదు కానుకలు వచ్చాయి. ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో భక్తులు లెక్కింపులో పాల్గొన్నారు. ఆదాయాన్ని బ్యాంకులో పాలకమండలి ఛైర్మన్ సంపత్, ధర్మకర్త పాల సుబ్రమణ్యంల సమక్షంలో డిపాజిట్ చేసినట్లు ఈవో తెలిపారు.

వరసిద్ధుడి సేవలో పునరుత్పాదక ఇంధన కార్పొరేషన్ ఛైర్మన్



శరత్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ శరత్ కుటుంబ సమేతంగా గురువారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు ఆపద్బాంధవుడు చంద్రబాబు నాయుడు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ అండగా తానున్నానంటూ ఆపన్నులను ఆదుకుంటున్న ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు అని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి తెలిపారు. గురువారం రామకుప్పం మండలంలోని 11 మంది లబ్ధిదారులకు రూ.8.16 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, సీతాపతి, బాలకృష్ణ, ఆదిల్, రవిరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు - రామసముద్రం మార్గంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన వెంకటరమణ ద్విచక్రవాహనంలో భీమగానిపల్లె పంచాయతీ శాంతి నగర్ వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వెంకటరమణను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.